
ఇక్కడ మేమంతా క్షేమంగానే ఉన్నాము. అక్కడ మీరెలా ఉన్నారు? క్షేమంగానే ఉన్నారని తలుస్తాను. కొత్త ప్రదేశం 'కొత్త వాతావరణం' కొత్త మనుమలు కాబోలు. వీటన్నిటికీ అలవాటు పడ్డారా లేదా?

నేను రాస్తున్న ఉత్తరాలన్నీ మీకు అంటుతూనే ఉన్నాయని ఊహిస్తాను. కానీ మీ దగ్గర్నుంచి ఒక్క దానికీ జవాబు రాలేదు. రాదని నాకు తెలుసు. మీకు ఉత్తరాలు రాయడమంటే ఎంత బద్ధకమో చిరాకో నాకు తెలీదేమిటి? !




మువ్వ శ్రీనివాస్

# పూజ్యులైన నాన్నగారికి..

''కాలచక్రం చూశారా ! ఎంత గిర్రున తిరుగుతోందో. ఇక్కడ్నుంచి మీరు వెళ్ళిపోయి అప్పుడే సంవత్సరం కావస్తోంది. కానీ నాకు మాత్రం మీరు నిన్ననో లేక మొన్నో వెళ్ళినట్టు మాత్రమే అనిపిస్తోంది. ఇంకా మీ రూపం నా కళ్ళముందు చాలా స్పష్టంగా మెదులుతూనే ఉంది. మీ ఫోటో ముందు పెట్టుకుని అందరూ నిద్రపోయాక నిశ్శబ్దరాత్రిలో మీతో బాస చేస్తుంటాను తెలుసా?

అదే మీరు ఇక్కడున్నప్పుడైతే ఎంచక్కా మనం ఇద్దరం వరండాలో మీరు పడక్కుర్చీలో వాలి నేనేమో మీ పక్కనే గట్టు మీద కూర్చొని మాటలు మొదలెడితే ఎంతకీ తెగేవి కావు. అమ్మ మధ్య మధ్యలో ''ఇక మాటలు చాలించి పడుకోండి చాలా రాత్రయింది'' అంటూ హెచ్చరిస్తూనే ఉన్నా చెవినపెట్టే వాళ్ళం కాదు.

అప్పుడు మీరు రాయమంటే రాసి చూపించాను చూశారూ ఆ కథ పోయినవారంపత్రికలో వచ్చింది. ఆ కాపీ ఒకటి మీకు పంపించాను కదా. చదివారా? ఎలా వుంది? ఆ కథ చాలా బాగుందని ఎందరో నన్ను ప్రశంసించారు. ఆ కథకు ఐడియా ఇచ్చింది మా నాన్నగారే అంటే అందరూ ఆశ్చర్యపోయారు.

మీ నాన్నగారు కూడా కథలు రాసేవారా అని అడిగారు. కానీ వాళ్ళకేం తెల్సు మీ జీవితమే ఓ గొప్ప కథల సంపుటని ! అప్పుడు వాళ్ళకు చెప్పాను నేను కథలు రాయలేదు కానీ గొప్పగేయాలు రాశారని, ఇప్పటికీ నాకు ఏకాంతంలో గుర్తొస్తూనే ఉంటుంది. మీరు కట్టిన పాట- ''ఎటకోయి నీ పయనం దూరతీరాలకా సుదూర దేశాలకా''

మొన్నామధ్య 'ఆల్బర్ట్‌కామూ' రాసిన ''ద అవుట్‌సైడర్'' చదువుతున్నప్పుడు మీరు భలే గుర్తొచ్చారు. మీరు ఇక్కడుండుంటే మీ చేత కూడా ఆ పుస్తకం చదివించి ఆ తర్వాత చర్చకు దిగుండేవాణ్ణి. ఎంతైనా మీరు లేని లోటు చాలా స్పష్టంగా ఎన్నో సందర్భాలలో ద్యోతకమవుతూ ఉంది.

ఈ మధ్య మీరు మరీబాగా గుర్తొస్తున్నారు. ఇంతకు ముందు ఎన్నో నిద్రలేని రాత్రుల లోంచి కథలు పుట్టుకొచ్చేవి. ఇప్పుడు నిద్రపోతున్న రాత్రుల్లోంచి మీ కలలు పుట్టుకొస్తున్నాయి.

నాన్నారు కలలో మాత్రమే కనిపించే జ్ఞాపకంగా మారారేమిటా అనిపిస్తుంటుంది ఒక్కొక్కప్పుడు. అలా అనిపించినప్పుడు వెంటనే మీ దగ్గరకు వచ్చేయాలనిపిస్తుంది. మిమ్మల్ని చూసి మరలా తిరిగి వచ్చేద్దామనిపిస్తుంది. ఓవేళ వస్తే మిమ్మల్ని విడిచి అక్కడ్నుంచి మీరు మమ్మల్ని విడిచి వెళ్ళినంత సులువుగా వచ్చెయ్యలేనేమోనని భయం. అదీగాక మీరుంది సుదూర తీరాలలోనాయె !

మీ ఆచూకీ నాకొక్కడికే తెలుసు. మామీద అలిగి కోపంతో చెప్పాపెట్టకుండా ఓ నిశ్శబ్ద రాత్రి మీరు ఇంటిని వదలిపెట్టి వెళ్ళిపోయారు. మీరు ఎక్కడికి వెళ్ళుంటారా అని ఆలోచించాను. ఇట్టే మీ ఆచూకీ కనిపెట్టేశాను. మీరు నాతో మాటల మధ్యలో తరుచూ అంటుండేవాళ్ళు 'హృషీకేశ్ వెళ్ళిపోవాల్రా అక్కడే నా చరమదశ ధ్యానంలో గడపాలి' అంటూ !



''ఎదురుగా ఇల్లు తగలబడిపోతుంటే హాయిగా అలా కూర్చున్నారేం?'' సాధువుని అడిగాడు శ్రీను.
''ఊరికే కూర్చోలేదు బాబూ. నిప్పు అంటుకున్న దగ్గర్నుంచీ.. వాన పడేలా చేయమని దేవుణ్ణి ప్రార్థిస్తున్నాను'' చెప్పాడు సాధువు.

పద్మశ్రీ [మాణిక్యారం]

మీరు అక్కడికే వెళ్ళుంటారనీ మీ వాంఛ మేరకు స్వామి శివానంద్ ఆశ్రమంలో చేరుంటారని నా ఊహ. ఆ ఆశతోనే అక్కడకు ఇలా ఉత్తరాలు వ్రాస్తున్నాను. మీ చిరునామా పట్టుకుని అమ్మను కూడా నాతోపాటు తీసుకుని మీ దగ్గరకు వచ్చేయాలనిపిస్తుంటుంది ఒక్కోప్పుడు అమ్మని చూస్తుంటే.

మీకు తెలియదుకానీ ఇక్కడ అమ్మ పరిస్థితి మరీ విషమంగా ఉంది. మీ ఎడబాటుతో అమ్మ మరీ బక్కచిక్కిపోయి కళ్ళు లోతుకుపోయి ముఖం మీద నల్ల చారికలతో బోసిముఖంతో 'అసలీమేనా మా అమ్మ' అనేంతగా మీమీద బెంగపెట్టుకుని చిక్కి శల్యమైపోయింది. అదీగాక అమ్మని ఒక్కదాన్నే చూస్తుంటే అదోలా వుంటుంది. చిన్నప్పటుంచీ మీ పక్కనే చూసిన అలవాటుకదా ఎంతైనా.

ఎప్పుడైనా అలా వేంకటేశ్వరస్వామి దేవాలయంలోకి వెళితే అక్కడ ఎప్పుడో మీరు పాడగా రికార్డు చేసిన క్యాసెట్టు లోంచి వినిపించే భజన కీర్తనలు నన్ను అల్లుకుపోయి అక్కడ్నుంచి కదలనియ్యవు.

నా చిన్నప్పుడు మీ చేతివేలు పట్టుకుని ఆ గుడికి వెళ్ళిన సాయంత్రాలు గుర్తొస్తుంటే హృదయాన్ని ఎవరో మెలిపెడుతున్నట్లనిపిస్తుంది. మీ సన్నిధిలో మీ సారథ్యంలో గడిచిపోయిన బాల్యం తిరిగొస్తే ఎంత బాగుంటుందో కదా అనిపిస్తుంది. అందుకే త్వరగా చచ్చిపోయి మరలా మీ దగ్గర బాల్యంలో పుట్టాలనిపిస్తుంది నాకు. అందరూ అంటూంటారు.

నా మొహం మీద అన్నీమీ మరకలేనట. అప్పుడప్పుడు తలమీద అక్కడక్కడా పౌడరు అద్దుకొని ఇక్కడమీరు మర్చిపోయివెళ్ళిన మీ కళ్ళజోడు తగిలించుకుని మీ పాత పైజామా, లాల్చీ వేసుకుని అద్దంముందు నిల్చొని నా ప్రతిబింబంతో మాట్లాడుతుంటే అచ్చంమీతో మాట్లాడుతున్నట్లేవుంటుంది. నాలో నేను మిమ్మల్ని చూసుకుంటున్నాను. అమ్మక్కూడా అదే చెబుతున్నాను నాలో మిమ్మల్ని చూసుకొమ్మని.

మీరు ఇక్కడలేకపోయినా మీరు అంకురం సమర్పించి ప్రసాదించిన ఈ దేహం మీ జ్ఞాపకంగా వుంది. మీ రక్తస్పర్శ చిహ్నంగా వుంది. ఇల్లుఖాళీ చేసినంత సులభంగా మీరు మా జీవితాలు ఖాళీ చేసి వెళ్ళిపోయినా మీ జ్ఞాపకాలు మమ్మల్ని వదలడంలేదు. మరుపు మనిషికి వరం అంటారు కానీ నా దృష్టిలో అది శాపం.

రేపు నేను పెళ్ళి చేసుకుని నాకూ పిల్లలు పుడ్తే నేను వాళ్ళని అసలు ప్రేమించకూడదనుకుంటున్నాను. వాళ్ళ నసలు దగ్గరకు కూడా తీసుకోకూడదనుకుంటున్నాను. వాళ్ళను నాకు దూరంగానే వుంచాలనుకుంటున్నాను. ఎందుకంటే మీ ఎడబాటుతో ఇప్పుడు నేను పడుతున్న వేదన రేపు నా పిల్లలు నా ఎడబాటుతో పడకూడదని.


ఒక్కోప్పుడు ఇలా ఉత్తరాలు వ్రాయడం అంతా నా పిచ్చి అనిపిస్తుంది. కానీ ఏం చెయ్యను మిమ్మల్ని మరువకుండా వుండడం కోసం నేను చేసే ప్రయత్నమిది. ఎందుకో మీరు లేరన్న నిజాన్ని అసలు భరించలేకపోతున్నాను.

'కొన్ని నిజాలు మనల్ని బాధపెట్టేవి అయితే అబద్ధాల్లోనే బ్రతుకుదాం. కొన్ని వాస్తవాలు మనల్ని ఊపిరితీసుకోకుండా చేస్తుంటే అవాస్తవంలోనే జీవిద్దాం'.

అందుకే మీరు సజీవంగానే వున్నారని ఊహించుకుంటూ బ్రతికున్నప్పుడు మీరు తరుచు వెళ్ళాలనే 'హృషీకేశ్' వెళ్ళారులెమ్మని సంబాళించుకుంటూ బ్రతికే వున్నారన్న ఆలోచనను కాపలా కాస్తూ ఇలా ఉత్తరాలు వ్రాసి కవరు మీద 'హృషీకేశ్' అని వ్రాసి పోస్టు చేస్తున్నాను. అలా చేయకపోతే ఎక్కడ ఈ హృదయం ఛిద్రం అవుతుందోనని భయం. అందుకే అవాస్తవంలో ఆత్మవిశ్వాసాన్ని నింపుకుంటూ ఆదమరచి నిద్రపోతున్నాను.

ఇక వుంటాను

తర్వాతి ఉత్తరంలో మరలా కలుద్దాం



''ఒంటి మీద బట్టల్లేకుండా కేవలం టోపీ పెట్టుకుని నడుస్తూ వెళుతున్నట్టు కల వచ్చింది డాక్టర్'' చెప్పాడు శంకర్.
''ఏం... మీకు సిగ్గుగా ఉందా?'' అడిగాడు డాక్టర్.
''అవును డాక్టర్... ఎందుకంటే... నేను పెట్టుకున్న ఆ టోపీ పదేళ్ళ పాతది'' వాపోయాడు శంకర్.

పద్మశ్రీ [మాణిక్యారం]